ప్రజాశక్తి

శుక్రవారం 16 ఆగస్టు 2024 | 5 | విజయనగరం



ఆర్‌పి సిసోడియా నేడు రాక

- భోగాపురంలో తహశీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాల సందర్శన
- కలెక్టరేట్‌లో భూ సమస్యలపై వినతులు స్వీకరణ

ప్రజాశక్తి- విజయనగరం

రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు భోగాపురం చేరుకొని తహశీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూ రికార్డులు పరిశీలిస్తారు. అనంతరం పలు గ్రామాలు సందర్శించి భూముల రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని తహశీల్దార్‌లు, రిజిస్ట్రార్ లతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి కలెక్టరు కార్యాలయంలో భూ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. భూ సమస్యలపై వినతులు ఇవ్వదలచిన వారు కలెక్టరు కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కలిసి తమ సమస్యలను విన్నవించవచ్చునని తెలిపారు.

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

- పతాకావిష్కరణ చేసిన మంత్రి శ్రీనివాస్
- జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని హామీ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- శకటాల ద్వారా ప్రభుత్వ ప్రగతి ప్రదర్శన
- ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / కోట

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. శాంతి కపోతాలను ఎగురవేశారు. వివిధ పోలీసు దళాల పెరేడ్ తిలకించి, గౌరవ వందనాన్ని స్వీకరించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలను అందిస్తున్న జిల్లా అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. పోలీసు అధికారులకు సేవా పతకాలను అందించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, జిల్లాకు ఖ్యాతి తెచ్చిన మహానీయులను ఈ సందర్భంగా గుర్తు చేసుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా 15 మంది కార్గిల్ యుద్ధవీరులను సన్మానించారు. తొలుత మంత్రి శ్రీనివాస్‌కు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ స్వాగతం పలికారు. హర్ ఘర్ తిరంగా సంతకాల ఉద్యమంలో భాగంగా, మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ అంబేద్కర్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డుపై జైహింద్ అని రాసి సంతకాలు చేశారు. వేడుకల్లో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, డాక్టర్ సురేష్‌బాబు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.277.97 కోట్ల వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ

డిఆర్‌డిఎ-వెలుగు ద్వారా పిఎంఇజిపి, బ్యాంకు లింకేజి, స్త్రీనిధి తదితర పథకాల నుంచి 38,534 మందికి రూ.277.97 కోట్ల విలువైన రొటావేటర్, ఆటో, ట్రెషర్ ఉపకరణాలను, పిఎంఎఫ్ ఎంఇ, యుపివిసి యూనిట్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ద్వారా ఆరుగురు వికలాంగులకు రూ.2.55 లక్షలు విలువైన ల్యాప్‌టాప్, టచ్ ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగురాలు కిలారి అశ్విని, తమకు డిగ్రీవరకు ప్రభుత్వ అంధుల పాఠశాలలోనే చదువుకొనే అవకాశాన్ని కల్పించాలని మంత్రి శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేయగా, అందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ఎపిఇపిడిసిఎల్ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ ఇతర ప్రముఖుల సెల్ఫీలు దిగారు. మెప్మా ద్వారా 586 సంఘాలలో ఉన్న 5860 మంది సభ్యులకు రూ.53,04,85,000 బ్యాంకు లింకేజీ పంపిణీ చేశారు. చేనేత జౌళిశాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో వస్త్రాలను ఎంపి కలిశెట్టి కొనుగోలు చేశారు.

ఆకట్టుకున్న శకటాలు

ప్రభుత్వ కార్యక్రమాలను, ప్రగతిని వివరిస్తూ శకటాల ప్రదర్శన జరిగింది. వ్యవసాయ-ఉద్యాన-పట్టుశాఖలు, డిఆర్‌డిఎ-వెలుగు, విద్యాశాఖ, వైద్యారోగ్యశాఖ, అగ్నిమాపక-విపత్తుల నిర్వహణ-పోలీస్, క్రీడా ప్రాధికార సంస్థ, మున్సిపాలిటీ, పరిశ్రమలశాఖ, డ్వామా, మహిళాభివద్ధి-శిశు సంక్షేమం మొదలగు ప్రభుత్వ శాఖలు తమ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ శకటాలను ప్రదర్శించి ఆకట్టుకున్నాయి. ఉత్తమ శకటాలుగా మున్సిపాలిటీలు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, వ్యవసాయ -ఉద్యాన, పట్టు పరిశ్రమ నిలిచాయి.

జెండా వందనం చేస్తున్న మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి : మంత్రి

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీరుస్తామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి త్వరలో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా 2047 నాటికి చేపట్టబోయే వికసిత్ ఎపి విజన్ డాక్యుమెంట్‌ను వివరించారు. సూపర్ సిక్స్ పథకాలను, తద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను, భవిష్యత్తులో అమలు చేయనున్న పథకాలను తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పథకం వల్ల పేదలకు కలుగుతున్న లబ్ధిని, ఉచిత ఇసుక విధానాన్ని వివరించారు. జిల్లా అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వేడుకలను తిలకిస్తున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ; దేశభక్తి గేయానికి విద్యార్థుల నృత్యప్రదర్శన

ప్రగతిని చాటిచెప్పిన స్టాల్స్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెరేడ్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని, కార్యకలాపాలను ప్రదర్శిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. డిఆర్‌డిఎ-వెలుగు, పౌర సరఫరాలు, నైపుణ్యాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ, వైద్యారోగ్యశాఖ, ప్రకతి వ్యవసాయం, చేనేత జౌళిశాఖ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ, మత్స్యశాఖలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ స్టాల్స్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, జెసి సేతు మాధవన్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్ఎ అదితి గజపతిరాజు సందర్శించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతమూ అలరించాయి. ముందుగా ప్రదర్శించిన పోలీసు జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జయహో నా జన్మభూమి- జామి కెజిబివి విద్యార్థులు, దేశ్ రంగేలా రంగేలా- నెల్లిమర్ల ఎంజెపిఎపిబిసివెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు, సరిహద్దున నువ్వే లేకుంటే- విజయనగరం ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థులు, వందేమాతరం రీమిక్స్- చీపురుపల్లి, రాజాం బాలభవన్ చిన్నారులు, దేశమంటే జనమంతా- విజయనగరం పిఎస్ఆర్ స్కూల్, భారత్ పిలిచిందోయ్- చీపురుపల్లి డాక్టర్ అంబేద్కర్ బాలియోగి గురుకులం తదితర విద్యాసంస్థల విద్యార్థులు దేశభక్తి గీతాలతో నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. వీటిలో ఫోర్టు సిటీ స్కూలు, పిఎస్ఆర్ స్కూలు, చీపురుపల్లి, రాజాం బాలబవన్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్తమంగా నిలిచాయి.

ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణలో విద్యార్థిని

మత సామరస్యాన్ని కాపాడుకుందాం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని ● ఆకట్టుకున్న జన జాగృతి సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో మత సామరస్యాన్ని, లౌకిక వాదాన్ని కాపాడుకుందామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సిఐటియు , ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సత్య డిగ్రీ కళాశాలలో బుధవారం రాత్రి జన జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్రావు అధ్యక్షతన జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ప్రముఖ జానపద కళాకారులు డప్పు శ్రీను, సారంగదరియా బృందం తిరుపతి, బద్రి కూర్మారావు, చంద్రిక రాణి, ఎల్ చిన్నారి, జి.నిర్మల , అర్.ఆనంద్ , పి రమణమ్మ దేశభక్తి, అభ్యుదయ గీతాలు ఆలపించారు. కనపాక కోలాటం టీం, కళ్యాణ్ ట్రింగ్స్ వయోలిన్ బృందం ప్రదర్శన, మన్యశ్రీ, డాన్స్ శ్రోతలను బాగా ఆకర్షించాయి. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస, టివి రమణ, బి సుధారాణి, నగర కార్యదర్శి బి.రమణ, సాహితీ స్రవంతి నాయకులు చీకటి దివాకర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన వారికి జ్ఞాపికలు అందజేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు కవితను రాసి చదివి వినిపించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ రాత్రి 12గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఎన్నో సవాళ్లను దేశం ఎదుర్కొందని, కార్పొరేట్, మత తత్వ పాలకుల విధానాలతో సంపద కేంద్రీకృతం అవుతుందని, పేదరికం, నిరుద్యోగం, ద్రవయోల్బణం తారాస్థాయికి చేరాయని అన్నారు. ప్రభుత్వ సంస్థలు మూతపడి అతి తక్కువ వేతనాలకు పనిచేసే స్కీమ్ వర్కర్లు, అసంఘటిత , కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య పెరుగుతోందని, వీరికి ఎలాంటి హక్కులు అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వీటివల్ల ప్రజల్లో వచ్చే అసంతృప్తిని దారి మళ్లించేందుకు కుల, మత ప్రాంతీయ విభేదాలను రెచ్చ గొడుతున్నారని, నాడు విదేశీ పాలన పోవాలని ఏ విధంగా పోరాడారో ఆ స్ఫూర్తితో మతతత్వ, కార్పొరేట్ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ వందన సమర్పనతో కార్యక్రమం ముగిసింది.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో సమస్యలపై పోరాటం

దత్తిరాజేరు : స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమిద్దామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు వి.లక్ష్మి పిలుపునిచ్చారు. మానాపురం సంతతోట జంక్షన్‌లో సిఐటియు అనుబంధంగా ఆటో మరియు క్యాబ్ కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకుని బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం కె.సురేష్ మాట్లాడుతూ పలువురు నాయకులు, కార్మికులు, ప్రజల విలువైన ప్రాణాల త్యాగ ఫలితమే ఈనాటి ఫలాలు అని, ఆ పోరాట స్ఫూర్తితో ఆటో కార్మికులు సమస్యలపై అందరూ ఐక్యమై పోరాడాలని అన్నారు. వి.లక్ష్మి మాట్లాడుతూ కార్మికులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా వారి పక్షాన నికరంగా సిఐటియు పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆటో క్యాబ్ స్టాండ్ అధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, కోశాధికారి రాధాకృష్ణ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తమ్మినేని సూర్యనారాయణ

అభ్యుదయ గేయానికి చిన్నారుల నృత్యప్రదర్శన

ఆటో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న వి.లక్ష్మి

హెచ్‌సి రామచంద్రశేఖర్‌కు ఇండియన్ పోలీసు మెడల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయనగరం పోలీసుశాఖకు చెందిన హెడ్ కానిస్టేబులు మండ రామచంద్ర శేఖర్‌కు కేంద్ర హోంశాఖ ఇండియన్ పోలీసు మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసుకు ప్రకటించినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాలలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సేవలను గుర్తిస్తూ, ఇండియన్ పోలీసు మెడల్ (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసు) పతకాలను ప్రకటిస్తూ, కేంద్ర హోంశాఖ ఈనెల 14న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇండియన్ పోలీసు మెడల్ పతకాలు పొందిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 20మందిని ఎంపిక చేయగా, వారిలో విజయనగరం జిల్లా పోలీసు శాఖలో స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబులుగా పని చేస్తున్న మండ రామచంద్ర శేఖర్ కూడా ఒకరని ఎస్‌పి తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీసు మెడల్ సాధించిన రామచంద్ర శేఖరరావును ఎస్‌పి తన కార్యాలయంలో అభినందించారు. హెచ్‌సికి అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, స్పెషల్ బ్రాంచ్ సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నర్సింహ మూర్తి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్‌సి రామచంద్రశేఖర్‌ను అభినందిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

పోలీసులకు సేవా పతకాలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలువురు పోలీసులకు సేవా పతకాలను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు. ఉగాది - 2024 సంవత్సరానికి గాను జిల్లా పోలీసుశాఖలో విశిష్టమైన సేవలందించిన పోలీసులకు రాష్ట్ర సేవా పతకాలను ప్రకటించగా, వాటిని మంత్రి ప్రదానం చేసారు. అదే విధంగా 2022 ఏడాదికి గాను రాష్ట్ర డిజి కమెండేషన్ డిస్క్ అవార్డులను కూడా ప్రదానం చేశారు. పోలీసు సేవా పతకాలు పొందిన వారిలో ఆర్.సునీల్‌కుమార్ (ఎఆర్ హెచ్‌సి), కె.వాసుదేవరావు (పిసి, పూసపాటిరేగ), జి.బంగారమ్మ (ఉమెన్ పిసి, జామి) ఉన్నారు. రాష్ట్ర డిజి కమెండేషను డిస్క్ అవార్డులు పొందిన వారిలో ఎం.శ్రీనివాసరావు (విజయనగరం డిఎస్‌పి), వై.పైడితల్లి (ఎఎస్ఐ, విజయనగరం టూటౌన్), ఎం.లక్ష్మీనాయుడు (ఎఎస్ఐ, రాజాం పిఎస్), ఎస్.నాగరాజు (ఎఎస్ఐ, స్పెషల్ బ్రాంచ్), పి.దివ్యజ్యోతి (హెచ్‌సి, మహిళా పిఎస్), ఎం.ప్రకాశరావు, ఎన్.సత్యనారాయణ (హెచ్‌సి, విజయనగరం), కె.త్రినాధరావు, సిహెచ్ వెంకటేష్ (పిసి, విజయనగరం), పి.లక్ష్మణరావు (పిసి, బొబ్బిలి), ఎం.భానోజీరావు (పిసి, చీపురుపల్లి) ఉన్నారు. వీరందరినీ ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు.

జలాశయానికి బుచ్చి అప్పారావు పేరు కొనసాగించాలి

ప్రజాశక్తి-వేపాడ

తాటిపూడి జలాశయానికి స్వాతంత్ర్య సమరయోధులు గొర్రిపోటు బుచ్చి అప్పారావు పేరు కొనసాగించాలని డిసిసిబి మాజీ చైర్మన్ వి.వి.చినరామునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం తాటిపూడి రిజర్వాయరుకు గొర్రిపోటు బుచ్చిఅప్పారావు పేరు పెట్టిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పేరు మార్చడం సమంజసం కాదన్నారు. రాజకీయాలకతీతంగా ప్రభుత్వం పునరాలోచించి, బుచ్చి అప్పారావు పేరు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలకంఠరాజపురం వైస్ సర్పంచ్ కె.పెద్దనాయుడు, విటిపి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డి-పట్టా భూముల రిజిస్ట్రేషన్లపై ఆరా

ప్రజాశక్తి - భోగాపురం

డి పట్టా భూముల రిజిస్ట్రేషన్‌లపై రిజిస్ట్రేషన్ల శాఖ డిఐజి పి.విజయలక్ష్మి, ఆర్‌డిఒ సూర్యకళ గురువారం సాయంత్రం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో డి-పట్టా భూములను జిరాయితిగా మార్చిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా అప్పటి మాజీ సిఎస్ బినామీలు ఈ భూములను కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి శుక్రవారం భోగాపురం తహశీల్దార్ కార్యాలయానికి రానున్నారు. డి-పట్టా భూములు జిరాయితీ గా మారిన తర్వాత ఈ భూములు ఎవరి పేరు మీద రిజిస్ట్రేషన్ జరిగాయో అనేదానిపై ఆరా తీయనున్నట్లు సమాచారం. అందుకు అధికారులు ముందస్తుగా భోగాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ లను పరిశీలించారు.

స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు చెబుతున్న హన్విక్ శ్రీరాం

చిన్నారి హన్విక్ ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని తోటపాలేనికి చెందిన రెండేళ్ల కరణం హన్విక్ శ్రీరాం 30 మంది స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు అనర్గళంగా చెప్పి అందరినీ ఆశ్చర్య పరిచాడు. స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కరణం హేమంత్, లాలిత్య సన్నిత కుమారుడు హన్విక్ శ్రీరాం అనర్గళంగా స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు చెప్పి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నాడు. కార్యక్రమంలో చిన్నారి తాత మీసాల ప్రభాకర్‌రావు, దాసరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలపై మువ్వన్నెల జెండా రెపరెపలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురువారం ఉదయం కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ గీతాలాపన అనంతరం, పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్.డి. అనిత, ఎస్‌డిసిలు, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఘనంగా వేడుకలు

విజయనగరం లీగల్ : జిల్లా కోర్టు ఆవరణలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎం.మీనాదేవి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాలు, దేశ రక్షణ సైనికుల కృషి ఫలితాన్ని మనం నేడు అనుభవిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగంలో న్యాయవ్యవస్థకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడం వల్ల ప్రజల హక్కులకు రక్షణ, భద్రత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.నాగమణి, బిహెచ్‌వి లక్ష్మీకుమారి, ఆర్‌వి మురళీకృష్ణ, టివి రాజేష్‌కుమార్, కె.వెంకట కల్యాణి, న్యాయవాదుల సంఘం సభ్యులు ఎ.హరీష్, విజి సంతోష్‌కుమార్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు. వినియోగదారుల హక్కుల కమిషన్ కోర్టులో కమిషన్ అధ్యక్షులు ఆర్‌వి నాగసుందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

కలెక్టరేట్, కోర్టు వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, న్యాయమూర్తి మీనాదేవి

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు కోరారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం రాజా కళాశాల మైదానంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన యువత, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీలను డిఎస్‌పి శ్రీనివాసరావు ప్రారంభించారు. పోటీలకు క్రీడా కిట్లను అంగన్వాడీ కార్యకర్త చెంచు లక్ష్మి విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, శివ, సిఐటియు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, సిఐటియు నాయకులు సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని పరిశీలించిన మంత్రి

విద్యార్థులతో సహపంక్తి భోజనం

ప్రజాశక్తి-గంట్యాడ

రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు గురువారం గంట్యాడ బిసి వసతిగృహాన్ని సందర్శించారు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న అనంతరం గంట్యాడ వెళ్లి బిసి బాలుర వసతిగహం సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో వారి పరిస్థితులు తెలుసుకున్నారు. విద్యార్థుల చదువు ఎలా సాగుతుందో ఆరా తీశారు. పాఠశాలలో తరగుతులు ఎలా సాగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులంతా బాగా చదువుకుని మంచి విద్యావంతులుగా, తల్లిదండ్రులు గర్వించే విధంగా ఉన్నతస్థాయికి ఎదగాలని చెప్పారు. విద్యార్థులు చదువుపై ష్టి సారిస్తే ఎలాంటి వసతులు కల్పించేందుకైనా సిద్ధంగా వున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీకు ఏం కావాలని విద్యార్థులను మంత్రి అడిగారు. తమకు ఆర్ఒ వాటర్ ప్లాంటు కావాలని కోరడంతో మంజూరు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. విద్యార్థుల క్రీడా సాధనకు అవసరమైన కేరం బోర్డు, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్ పరికరాలు అందజేస్తామని వెల్లడించారు. ఎం.పి. కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ గంట్యాడ గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్టు తాను ఎన్నికల ముందు ప్రకటించానని, తన దత్తత గ్రామమైన గంట్యాడ బిసి వసతిగృహం విద్యార్థులకు దుస్తులు అందజేస్తానని చెప్పారు. అనంతరం విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి వారితో పాటే మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు నేలపై కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. మంత్రి వెంట జిల్లా బిసి సంక్షేమాధికారి సందీప్ కుమార్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్‌పి అప్పలనాయుడు

వి.శ్రీనివాస్ (హౌసింగ్ పీడీ) | కె.మధుసూదనరావు(డిఎస్‌ఒ) | ఆర్ఎస్ కుమార్(ట్రెజరీస్ డిడి) | పి.బాలాజి(సిపిఒ) | కళ్యాణ్‌చక్రవర్తి(డిఆర్‌డిఎ పీడీ) | ఎల్.శ్రీధర్‌రాజా (డిపిఒ) | బి.ఉమాశంకర్(ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ) | కె.విజయరత్నం(ఆర్అండ్‌బి ఎస్‌ఇ) | లక్ష్మణరావు (ట్రాన్స్‌కో ఎస్‌ఇ)

ఉత్తమ సేవలకు 'ప్రశంస'లు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బంది, ఎన్‌జిఒలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రశంసాపత్రాలను అందజేశారు. అందులో భాగంగా డిఆర్‌ఒ ఎస్‌డి అనితకు ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్ పాల్గొన్నారు.

మీనాకుమారి(సిఎస్ డిఎం) | డి.రమేష్(డిఐపిఆర్‌ఒ) | నరేంద్ర (ఐటి సెల్) | కె.సందీప్‌కుమార్ (డిబిసిఒ) | ఎం.సుమబాల(ఎస్‌డిసి) | ఎ.సాయిశ్రీ (ఆర్‌డిఒ) | బి.శాంతి (ఆర్‌డిఒ) | ఎం.వి.సూర్యకళ (ఆర్‌డిఒ) | బి.సుధాకరరావు (మెప్మా పీడీ)

ఎ.తిరుపతిరావు (ఎఒ) | శివాజి (డిఇఒ కార్యాలయం) | ప్రభుదాసు (సమాచారశాఖ) | ఎస్.జానకమ్మ (డివిజనల్ పిఆర్‌ఒ) | జమదగ్ని(ఉద్యానశాఖ డిడి) | ఎం.ఎం.నాయుడు (కమిషనర్)

సొంత నిధులతో కల్వర్టుల నిర్మాణం

ప్రజాశక్తి-పూసపాటిరేగ

కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు సొంత నిధులు రూ. 12 లక్షలు వెచ్చించి రహదారి మధ్యలో కల్వర్టుల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. జీవీల గ్రామంలో పొలాలకు రైతులు వెళ్లేందుకు గానూ, కొవ్వాడ నుండి చోడమ్మ అగ్రహారం హైవేకు, కొవ్వాడ నుంచి మైలాన్ కంపెనీకి, తమ గ్రామంలో శ్మశానానికి గ్రావెల్ రహదార్లు నిర్మాణం చేసామన్నారు. అయితే పోలాల్లో నుంచి నీరు చెరువులకు వెళ్లిపోయేలా కల్వర్టులు అవసరం అని గుర్తించామన్నారు. ప్రభుత్వం కల్వర్టులు మంజూరు చేయాలంటే ఇప్పటిలో జరిగే పని కాదని అందుకే గ్రామంలో రైతులు అవసరం నిమిత్తం తానే సొంత నిధులు వెచ్చించి వేస్తున్నామన్నారు. కోమటి చెరువుకు వెళ్లే దారిలో రెండు కల్వర్టులు సుమారుగా రూ. లక్షతో, చోడమ్మ అగ్రహారం వెళ్లే దారిలో నాలుగు కల్వర్టులు రూ. 1.60 లక్షలతో, సిమ్మలరాం కల్లాలకు రూ. 40వేలు, శివాలయానికి వెళ్లే రహదారిలో కల్వర్ట్ రూ.70 వేలు, శ్మశానానికి వెళ్లే దారిలో రెండు స్లాబ్ కల్వర్టులు సుమారుగా రూ.3.5 లక్షలు, శివాలయానికి వెళ్లే రహదారి నిర్మాణం రూ. 4.5 లక్షలు అవుతుందన్నారు. ఇందులో రహదారి నిర్మాణం పూర్తి అయ్యిందని, ప్రస్తుతం కల్వర్టుల నిర్మాణం అవుతుందని చెప్పారు. మరి కొన్ని రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

ఉత్తమ ఉద్యోగులుగా 50 మంది ఎంపిక

భోగాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న వివిధ శాఖలతో పాటు పారిశుధ్య కార్మికులను మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు పనిచేస్తున్న వీరిలో 50 మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. వారికి మెమెంటో, ప్రశంసా పత్రంతోపాటు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపిపి రావాడ బాబు, ఎఒ బంగారయ్య, ఇఒపిఆర్‌డి సురేష్, నాయకులు పదాల శ్రీనివాసరావు, సుందర హరీష్ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ ఎస్‌ఐగా సాయికృష్ణ

గంట్యాడ : గంట్యాడ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా డి.సాయికృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఆయన బదిలీపై గంట్యాడ ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఇప్పటివరకు గంట్యాడ ఎస్‌ఐగా పనిచేసిన సురేంద్రనాయుడు ఎస్‌బికి బదిలీ అయ్యారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

కొత్తవలస : తుమ్మికాపల్లి వద్ద ఉన్న వినాయక్ నగర్‌లో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జూనియర్ సివిల్ జడ్జి విజయ చందర్, తహశీల్దార్ నీలకంఠరావు, సూర్యోదయ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ గణేష్ వీటిని అందజేశారు. 300 మందికి ఉన్నతంగా కార్యక్రమం నిర్వహించారు. ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా జూనియర్ సివిల్ జడ్జి జెండావిష్కరణ చేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ రాజేశ్ కుమార్, లీగల్ అడ్వైజర్ గవర కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

వేపాడ : మండలంలోని ఆతవ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు మాజీ సర్పంచ్ సిరికి రామలక్ష్మి, టిడిపి నాయకులు సిరికి రమణ ఆర్థిక సాయంతో బూట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొంప వేమన నాయుడు, ఎఎంసి వైస్‌చైర్మన్ గొంప సంధ్య, మరడ బాడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు అందజేస్తున్న సర్పంచ్

పారిశుధ్య కార్మికులకు సన్మానం

వేపాడ సచివాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.ఉమ, కార్యదర్శి బి.గౌరి, సర్పంచ్ ఎం.అర్జునమ్మ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, గాడి గంగ తల్లి, ఎ.రమణ పాల్గొన్నారు.

తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు

నాన్న ఆశయాలను కొనసాగిస్తా

మాజీ ఎమ్మెల్యే లక్ష్మునాయుడు

బాడంగి : తన తండ్రి, కీర్తిశేషులు తెంటు జయప్రకాశ్ ఆశయాలను కొనసాగిస్తానని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు అన్నారు. తెంటు జయప్రకాశ్ 76వ జయంతి వేడుకలను బాడంగిలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత జయప్రకాశ్ సమాధిపై తల్లి సత్యవతమ్మతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాడంగిలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బేబినాయనతో కలిసి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడవాడలా జెండా పండగ

జెడ్‌పి కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు; కార్పొరేషన్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న మేయర్ వి.విజయలక్ష్మి

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

విజయనగరం టౌన్ : నగర అభివృద్ధికి అందరి సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, కమిషనర్ ఎంఎం నాయుడు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్, గంట్యాడ, పూసపాటిరేగ జెడ్‌పిటిసిలు, సిబ్బంది పాల్గొన్నారు. **విద్యుత్తు భవన్‌లో..** ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ ఎం. లక్ష్మణరావు జెండా ఎగురవేశారు. విద్యుత్ ఉద్యోగులలో ఉత్తమ పనితీరు కనపరిచిన వారిసర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఇఇ పి.హరి, రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్‌టియుజివిలో వైస్ – ఛాన్సలర్ (ఇంచార్జి) ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి జెండా ఎగురవేశారు. ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు , ఎన్ ఎస్ ఎస్ క్యాడెట్‌లు నుండి గౌరవవందనం స్వీకరించారు. కిక్ బాక్సింగ్‌లో కాంస్య పతకం సాధించిన రఘు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కె. దినేష్‌కు నగదు బహుమతి అందజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ , యూనివర్సిటీ డైరెక్టర్ వైస్– ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జె. నాగరాజు, వివిధ విభాగాల అధిపతులు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీలో విసి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎందరో త్యాగధనుల నిస్వార్థ సేవలకు ఫలితంగా మనం శ్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామని అన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్చంద్ర బాబు, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలకు విసి కట్టిమని సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. **కేంద్రీయ విద్యాలయంలో..** ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ జాతీయ పతాకావిష్కరణ చేసారు. స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు , నృత్య ప్రదర్శనలు అలరించాయి. **సీతం ఇంజినీరింగ్ కళాశాలలో** కరస్పాండెంట్ డా.బొత్స ఝాన్సీలక్ష్మి జెండా ఎగురవేశారు. ముఖ్య అతిథులుగా కె. సంతోష్ కుమార్, బి.సూర్య లక్ష్మి హాజరయ్యారు. ఈసందర్భంగా దేశభక్తి గేయాలు, నృత్య ప్రదర్శనలు, ఎన్‌సిసి క్యాడెట్లు పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మజ్జి. శశి భూషణ్ రావు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.రామమూర్తి, కెప్టెన్ ఎం. సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం. వరలక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, సిఎస్‌ఒ కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ స్కూల్‌లో రిటైర్డ్ పంచాయతీ రాజ్ ఇంజినీర్ చీకటి దివాకర్ విచ్చేసి జెండా వందనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. స్వరూప , హెచ్ఎం పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో..

విజయనగరం కోట : టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో జాతీయ జెండాను ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల ఫలితమే నేడు స్వాతంత్ర్య ఫలాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగి : జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎస్ఎంసి చైర్‌పర్సన్ బొంగు భారతి జెండా ఎగురవేశారు. జెడ్‌పిటిసి రామారావు, ఎంపిటిసి శ్రీనివాసరావు, సర్పంచ్ కండి రమేష్ పాల్గొన్నారు. ఆకులకట్టలో సర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ జెండా ఎగురవేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఆంజనేయులు, గ్రంథాలయంలో నిర్వాహకులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

బొబ్బిలి : పట్టణంలో సిహెచ్‌సి, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం కార్యాలయంలో, కోటలో ఎమ్మెల్యే బేబినాయన జాతీయ జెండాను ఎగురవేశారు. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కలిగించేందుకు స్వాతంత్ర్య సమరయోధులు పోరాటం చేస్తే, రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన నుంచి విముక్తి కోసం ఎన్నికల్లో కూటమిని గెలిపించారని ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, పోలీసు స్టేషన్లో డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, జనసేన కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, కోర్టు వద్ద సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ, ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి వద్ద రోటరీ డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు, అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేశారు. జాతీయ జెండాలతో కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు.

రామభద్రపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ సులోచనారాణి, పోలీసు స్టేషన్ వద్ద ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, విశాఖ డెయిరీ వద్ద మేనేజర్ రామచంద్రరావు, ఎస్‌బిఐ బ్రాంచి వద్ద మేనేజర్ బి.హరింద్ర జాతీయ జెండాను ఆవిష్కరించారు.

శృంగవరపుకోట : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, డిటి భరత్ పాల్గొన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి సోమేశ్వరరావు, పంచాయతీ కార్యాలయంలో సర్పంచి సంతోషికుమారి జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సుధారాణి, పినిశెట్టి రమణ, ఇఒ అనురాధ పాల్గొన్నారు. ఆర్‌టిసి డిపో వద్ద మేనేజర్ కె.రమేష్, పోలీస్ స్టేషన్‌లో సిఐ నారాయణమూర్తి జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గంగరాజు పాల్గొన్నారు.

మెంటాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, మెంటాడ హైస్కూల్లో ఎస్ఎంసి చైర్మన్ రొంగళి కన్నబాబు, మోడల్ స్కూల్లో చైర్‌పర్సన్ జాడ శ్రీదేవి జాతీయ జెండాను ఎగురవేశారు.

బొబ్బిలిరూరల్ : తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బేబినాయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీను పాల్గొన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద వైస్ ఎంపిపి ఎ.శంకర్రావు జెండాను ఎగుర వేశారు.

బొండపల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి చల్ల చలంనాయుడు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ కె.లక్ష్మణరావు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, ఎంపిడిఒ వైవి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. గొట్లాం గాయత్రి టెక్నో స్కూల్లో కరస్పాండెంట్ జి.జగదీశ్వరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. డైరెక్టర్ జి.ఎరుకునాయుడు, ఎఒ జి.రాఘవకుమార్ పాల్గొన్నారు.ఎయిమ్ పాఠశాలలో కరస్పాండెంట్ కడగల ఆనంద్‌కుమార్ జెండా ఎగురవేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గజపతినగరం : తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ బి.రత్నకుమార్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక జెండాలు ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కిశోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద సిఐ జి.ఎ.వి రమణ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యు.మహేష్ పాల్గొన్నారు. శారదానికేతన్ స్కూల్లో మాజీ సైనికుడు కాకర అప్పారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కరస్పాండెంట్ కె.సన్యాసిరావు, ఆర్మీ సైనికుడు కె.చిన్నారావు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి.సత్యవంతుడు, తహశీల్దార్ డి.సన్యాసినాయుడు, ఎంపిడిఒ జి.ఉమ, ఎస్‌ఐ కె.రాజేష్, ప్రిన్సిపల్స్ ఉషారాణి, కిరణ్మయి, ఆర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తవలస : డిఫెన్స్ అకాడమీలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కొత్తవలస ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నీలకంఠారావు పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కనకాల శివ, ఉపాధ్యక్షులు యల్లపు సూరిబాబు, తిక్కాన చినదేముడు, తదితరులు పాల్గొన్నారు.

రాజాం : స్థానిక ప్రాంతీయ ప్రెస్ క్లబ్‌లో, సిహెచ్‌సిలో, నగర పంచాయతీ కార్యాలంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పతాకావిష్కరణ చేశారు. వందపడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేటు ఆసుపత్రికి ధీటుగా తయారు చేస్తామని తెలిపారు. రాజాం పోలీస్ స్టేషన్‌లో సిఐ దాడి మోహన్ రావు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జండా వందనం చేశారు. సన్‌రైజ్ హాస్పిటల్ ఆవరణలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైసిపి నియోజకవర్గం ఇంచార్జ్ తలే రాజేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

వంగర : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డి.ధర్మరాజు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌ఐ వైవి జనార్ధన జెండా ఆవిష్కరించారు. స్థానిక వివేక మాస్టర్ మైండ్ పాఠశాల వద్ద సర్పంచ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కరణం సుదర్శనరావు, ఆర్‌ఐ జామి మురళి తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: ఎంపిడిఒ కార్యాలయం, కెజిబివి పాఠశాల ఆవరణలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివసారావు పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, ఎంపిడిఒ ఎం.రత్నం, ఎంఇఒ చంద్రశేఖర్, కెజిబివి ప్రిన్సిపాల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంపిపి పొట్నూరు ప్రమీల జెండాను ఎగురవేశారు. జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతిరావు, ఎంపిడిఒ కల్యాణి, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, డాక్టర్ జి.చెన్నయ్, వెంకట్ మధు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే లోకం నాగ మాధవి జాతీయ పతాకం ఎగుర వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు, నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్మెన్ బంగారు సరోజినీ జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి. సుదర్శన రావు, ఎంపిడిఒ జి. గిరిబాల, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, కూటమి నాయకులు లెంక అప్పల నాయుడు, లెంక హైమావతి తదితరులు పాల్గొన్నారు. అలుగోలు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఛైర్మెన్ ఆల్తి బాబురావు జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కురిమినేని దివాకర్, సర్పంచ్ అలుగోలు బంగారమ్మ, పాల్గొన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యా లయంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

భోగాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ సర్కిల్ కార్యాలయం, జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే లోకం మాధవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు, తహశీల్దార్ ఎం.సురేష్, సిఐ రవికుమార్, ఎస్.ఐ సూర్య కుమారి, ఉప తహశీల్దారు శ్రీనివాసరావు, నాయకులు పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, వందనాల రమణ, అప్పలకొండ, కొండపు రమణ తదితరులు పాల్గొన్నారు. పోలిపల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ఎంతో మంది త్యాగధనుల ఫలితమే ఈ స్వాతంత్ర్యమని ఎమ్మెల్యే మాధవి అన్నారు. మండలం కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆమె జెండాను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన పలువురు అధికార్లకు ప్రశంసా పత్రాలను అందజేసారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి మహంతి కళ్యాణి, సచివాలయం, గ్రంథాలయం వద్ద సర్పంచి టి. సీతారాం జెండా ఎగరవేసారు. కార్యక్రమంలో నాయకులు మహంతి శ్రీనువాసరావు, ఎంపిటిసి పిన్నింటి లక్ష్మంనాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు, తహశీల్దార్ తాడి గోవింద, ఎంపిడిఒ రాధిక, డిటి లావణ్య, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారులకు మిఠాయిలు పంచిపెడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

త్యాగాలను మరవొద్దు : ఎస్‌పి

విజయనగరం కోట : పోలీసుశాఖ ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం, పోలీసుసంక్షేమ పాఠశాలవద్ద ఎస్‌పి వకుల్ జిందాల్ జాతీయజెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సమరయోధులు చేసిన పోరాటాలు, త్యాగాలను మరువ వద్దని అన్నారు. విద్యార్థులు మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకొని, ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికేట్లును ప్రదానం చేసారు. కార్యక్రమాల్లో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎంఎంసోల్మన్, డిఎస్‌పిలు యూనివర్స్, ఆర్.గోవిందరావు, ఎం.వీరకుమార్, సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నర్సింహమూర్తి, ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.భగవాన్, కార్యాలయ పృవేక్షకులు ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు



బొబ్బిలి, శృంగవరపుకోట, రాజాంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యేలు బేబినాయన, కోళ్ల లలితకుమారి, కోండ్రు మురళీమోహన్, భోగాపురంలో జెడ్‌పి హైస్కూలులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి